

చంద్రబాబు అభివాదం

రైతులకు అండగా : ఎమ్మెల్యే మద్దిపాటి



రైతుల ఆదాయం పెంచే విధంగా తమ ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొచ్చి రైతు కుటుంబానికి అండగా ఉంటుం ది. 25 ఏళ్ల కిందట చంద్రబాబు ఇంకుడు గుంతలు తవ్వండి, చెక్ డ్యామ్‌లు కట్టండి అంటే ఎవరూ పెద్దగా పట్టించుకోలే దు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితిలో రైతులే ఇంకుడు గుంతలు కావాలంటున్నారు.. చంద్రబాబు విజన్ ఇలా ఉంటుంది. నదులను అనుసంధానం చేశారు. రైతుకు ఏది అవసరమో అది చేస్తారు.





రైతన్నా- మీ కోసం

నల్లజర్ల రైతన్నా - మీ కోసం సభలో నులక మంచంపై కూర్చుని రైతుల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు చిత్రంలో మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మద్దిపాటి, కలెక్టర్ కీర్తి, బాపిరాజు

నేనున్నా!

అండగా ఉంటా..ఆదుకుంటా



ఎలా ఉన్నావయ్యా : ఎమ్మెల్యే నల్లమిల్లి, అనపర్తి ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఎం

(రాజమహేంద్రవరం/నల్లజర్ల/ గోపాలపురం/కొవ్వూరు/ దేవరపల్లి - ఆంధ్రజ్యోతి)

మీ సమస్యలు చెప్పండి.. వింటా.. పరిష్కరిస్తా.. అంటూ సీఎం చంద్రబాబు రైతులతో కలిసిపోయారు.. నల్లజర్లలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో సాధారణ నులక మంచంపై కూర్చుని రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా సీఎం చంద్రబాబు చెట్టుకింద కూర్చుని రైతులు చెప్పింది ఆసక్తిగా విన్నారు.. సూచనలు.. సలహాలు స్వీకరించారు.. మీరు చెప్పింది నేను చేస్తా అంటూ వారి భరోసానిచ్చారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల జాతీయ రహదారికి సమీపాన బుధవారం జరిగిన రైతన్నా-మీకోసం కార్యక్రమం ఎవరూ ఊహించని విధంగా సభ ఏర్పాటు చేశారు. ఆరంభం నుంచి చివరి వరకూ వినూత్నంగా.. ఆసక్తిగా జరిగింది. ఉదయం 12 గంటలకు ఆరంభమైన చంద్రబాబు పర్యటన సాయంత్రం ఐదు గంటల వరకూ సాగింది. మొదట ఒక రైతు పొలంలో వేసిన వివిధ పంటలను సీఎం స్వయంగా పరిశీలించారు.ఒకేచోట వివిధ రకాల మొక్కలు పెంచడంపై ఆరా తీశారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఐదు స్టాల్స్‌ను తిలకించారు.ఆ స్టాల్స్‌లో వస్తువుల గురించి అధికారులు వివరించగా ఆయన విని.. వారిని అభినందించారు. రెండు గంటల సమయంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ పోతవరం రోడ్డు సమీపంలో ఓ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలతో సమీక్షించారు.తొలుత చంద్రబాబు భూగర్భజలాలు, పం టల మార్పిడి, ఆదాయం, యంత్రాల వినియోగం, లాభ సాటి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పంటల సాగు వంటి వాటి గురించి ప్రస్తావించారు. సభ ఏర్పాట్లు బాగా చేసినందుకు కలెక్టర్ కీర్తి చేకూరిని, నియోజకవర్గంలో బాగా పనిచేస్తున్నందుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును అభినందించారు.కలెక్టర్ కీర్తి చంద్రబాబును సన్మానించారు.రోడ్ల పొడవునా కార్యకర్తలు బారులు తీరారు. పోలీసులు బందోబస్తు, భారీ భద్రత ఏర్పాట్లు చేశారు.గోపాలపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.320 కోట్ల ప్రణాళికను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సీఎంకు అందజేశారు. నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన నేత సువర్ణరాజు, మహిళా నేతలు స్వాగతం పలికారు.

- చెట్టు కింద.. నులక మంచంపై సీఎం సభ
- హంగూ ఆర్భాటం లేకుండా నిర్వహణ
- రైతుల సమస్యలు విన్నారు..
- సలహాలు స్వీకరించారు..
- మీరు చెప్పింది చేస్తా అంటూ భరోసా
- నల్లజర్లలో చంద్రబాబు సభ సక్సెస్

నేనూ వ్యవసాయం చేసేవాడిని..

నేను కూడా రైతు బిడ్డనే.. వ్యవసాయం చేసేవాడిని.. రైతు కష్టమేంటో తెలిసినవాడిని..అయితే రాజకీయాల్లోకి వచ్చా. ఇవాళ రైతులు చదువుకున్నవారు ఉన్నారని.. పీజీలు, పీహెచ్‌డీలు చేసినవారున్నారని.. అందరూ ప్యాంట్లు వేసుకుని వచ్చారని..మోడరన్ రైతులయ్యారని జోకులు వేయడంతో అందరూ నవ్వుకున్నారు. సభలో సీఎం చంద్రబాబు ఇద్దరు రైతులను తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. అందులో ఒకరు ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ నీలపాల నరసింహం కుడి వైపు కూర్చోగా, నల్లజర్లకు చెందిన గుదే అర్జునరావు ఎడమ వైపు కూర్చున్నారు.



వెల్‌కమ్ సార్ : సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిశోర్

అధిక శాతం మఫ్టీలోనే.. నిఘాకు ప్రాధాన్యం

విజిబుల్ పోలీస్.. ఇన్‌విజిబుల్ పోలీసింగ్.. ఇది సీఎం చంద్రబాబు పదే పదే పోలీసులకు చెప్పేమాట. ఆయన నల్లజర్ల పర్యటనకు జిల్లా పోలీసులు ఆ మాటను నిజం చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నరసింహ కిశోర్ 1300 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 12 సెక్టార్లుగా విభజించి నలుగురు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 63 మంది ఎస్ఐలు, మిగతా సిబ్బందిని నియమించారు. 7 స్పెషల్ పార్టీలు, 25 రోప్ పార్టీలు, 5 ఏరియా డీవోఎం పార్టీలను బందోబస్తులో భాగం చేశారు. ఈసారి సుమారు 60 శాతం మందికి యూనిఫాం వేయలేదు. మఫ్టీలోనే జనాల్లో తిరుగుతూ అనుపానులు గమనించారు. మహిళా పోలీసులను మఫ్టీలో మోహరించారు. కీలకమైన ప్రాంతాల్లోని కెమెరాలను డీజీపీ, నిఘా చీఫ్ కంట్రోల్‌కి అనుసంధానించారు. డ్రోన్ల ఫుటేజీలను నిరంతరం పరిశీలించారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఇద్దరు చొప్పున బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.





ఏంటివి : కొబ్బరి పీచుతో తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి దుర్గేష్



హాజరైన జనం

1.14 లక్షల మంది రైతు కుటుంబాలను కలిశాం : కలెక్టర్

నవంబరు 24 నుంచి 30వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లాలో లక్షా 14 వేల రైతు కుటుంబాలను కలిశాం. ఇంటింటికి వెళ్లి సీఎం సందేశ లేఖను అందించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత, విలువవృద్ధి, ప్రభుత్వ సమన్వయం అనే పంచసూత్రాల అమలుతో వ్యవసాయరంగం బలోపేతవుతుందని 'తూర్పు' జిల్లా కలెక్టర్ కీర్తి పేర్కొన్నారు.

ఆదర్శ రైతులకు సత్కారం





సీఎం సమక్షంలో ఆదర్శ రైతులు సింగరాజుపాలెం గ్రామానికి చెందిన దొండపాటి లక్ష్మీనారాయణ(బాబు), గుండుగొలనుగుంటకు చెందిన ఒబెలిశెట్టి గోపాలకృష్ణ, కురుకూరుకు చెందిన యెలమతి భాస్కరరావు, దుద్దుకూరుకు చెందిన కాకర్ల హరినాథ్, చిట్యాలకు చెందిన గద్దె హరిశ్చంద్రప్రసాద్, యర్నగూడెం గ్రామానికి చెందిన గద్దె మునేశ్వరరావు, వాదాలగుంటకు చెందిన గేద జోగేంద్ర ప్రసాద్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు.

పంచాయతీరాజ్ చరిత్రలో..

కొత్త అధ్యాయం

- ఆర్డీవో మాదిరిగా డీడీవో వ్యవస్థ
- రూ.25లక్షలతో నూతన హంగులు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం



పెద్దాపురంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన డీడీవో కార్యాలయ భవనం

(పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్‌శాఖలో కొత్త చరిత్ర ఆరంభమైంది. గతంలో ఏదో పేరుకే ఉన్న డీఎల్డీవో పోస్టును కూటమి ప్రభుత్వం పటిష్ఠం చేసింది. రెవెన్యూశాఖలో ఆర్డీవో ఎంత కీలకంగా ఉంటారో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీవో) అభివృద్ధి సంబంధిత వ్యవహారంలో అంతే కీలక పాత్ర పోషించనున్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీరాజ్‌శాఖలో చేపట్టిన గణనీయమైన మార్పుల్లో ఈవ్యవస్థ అత్యంత కీలకంగా కనిపిస్తోంది. ఇందులోభాగంగా పెద్దాపురం డివిజన్‌లో డీడీవో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. పెద్దాపురం పట్టణంలో దీన్ని రూ.25లక్షలతో కొత్త హంగులతో తీర్చిదిద్దారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. డీడీవోలు ఈనెల 4నుంచి నూతన కార్యాలయాల నుంచే విధులు నిర్వర్తించనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను పర్యవేక్షించడం, ఉపాధి హామీ పథకం, గ్రామ పంచాయతీలపై కూడా పూర్తి అజమాయిషీలను వారికి అప్పగించనున్నారు. ఇటువంటి కీలకమైన బాధ్యతలకోసం ఒక్కో డీడీవో కార్యాలయంలో 15మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించనుంది.

ఇదొక అద్భుతమైన సంస్కరణ



పంచాయతీరాజ్ చరిత్రలో వచ్చిన గొప్ప మార్పుల్లో డీడీవో వ్యవస్థ ఒకటి. ఇదొక అద్భుత మైన సంస్కరణ. ఈ శాఖలో ఇంత కీలకమైన పోస్టు రూపుదిద్దుకోవడంలో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ కమిషనర్ చూపించిన చొరవ చాలా గొప్పది. దీనిద్వారా డివిజన్ స్థాయిలో డీడీవోకు పూర్తి అధికారాలు వచ్చినట్టు అయ్యింది.

-మద్దిపట్ల శ్యామల, డీడీవో, పెద్దాపురం

కాలం చెల్లిన కిట్లతో స్క్రబ్ టైఫస్ పరీక్షలు!

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో కాలం చెల్లిన కిట్లతో స్క్రబ్ టైఫస్ పరీక్షలు నిర్వహిస్తుండడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇక్కడ పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్ట్ ఈ నిర్వాకానికి పాల్పడుతున్నట్టు సమాచారం. ప్రభుత్వం అందిస్తున్న రీ ఏజెంట్లు వినియోగించకుండా అత్యవసర వేళల్లో అవకాశం కల్పించిన విధంగా లోకల్ పర్చేజ్ కింద బయట నుంచి వీటిని తెప్పిస్తున్నారని, కాలం చెల్లినవి ఉచితంగా తీసుకువచ్చి ఇలా జేబులు నింపుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ ఎక్స్‌పైరీ కిట్లతోనే రెండు నెలలుగా స్క్రబ్‌టైఫస్ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిసింది. జిల్లావ్యాప్తంగా ఈ పరీక్షలు చేస్తున్నది జీజీహెచ్‌లోని వీడీఆర్ఎల్ ల్యాబ్‌లో మాత్రమే. కాసులకు కక్కుర్తిపడ్డ రీసెర్చ్ సైంటిస్ట్ వీటితోపాటు ఇతర పరీక్షలను కూడా కాలం చెల్లిన కిట్లతోనే చేయడం, ఒక్కోసారి తనకు తోచినట్లు నివేదిక రాసి ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

8న కేరళకు ఉప్పాడ మత్స్యకారులు



మంగళగిరిలోని తన కార్యాలయంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

- 60మందిని రెండు బ్యాచ్‌లుగా పంపనున్న మత్స్యశాఖ
- మత్స్యకారులకు ఇచ్చిన వంద రోజుల గడువు ప్రణాళికపై సమీక్షించిన డిప్యూటీ సీఎం పవన్

కాకినాడ/కొత్తపల్లి, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): ఉప్పాడ మత్స్యకారులను కేరళ, తమిళ నాడుకు పంపి వేట నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈమేరకు 60 మంది మత్స్యకారులను రెండుబ్యాచ్‌లు పంపాలని నిర్ణయించింది. మొత్తం ఆరురోజులపాటు ఈరెండు రాష్ట్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఉప్పాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వంద రోజుల గడువు కోరిన నేపథ్యంలో దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికపై అమరావతిలో బుధవారం సమీక్ష జరిగింది. పవన్‌కల్యాణ్‌తోపాటు కలెక్టర్, ఇతర మత్స్యశాఖ ఉన్నతాధికారులు హాజరైన ఈ సమీక్షలో ఉప్పాడ నుంచి వందమంది మత్స్యకారులు హాజరయ్యారు. తొలుత కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఉప్పాడ మత్స్యకారులకు జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వం తరపున చేపడుతున్న చర్యల గురించి వివరించారు. సముద్రంలో సీవీడ్ పెంపకం, మత్స్యసంపద పెరిగేలా చేప పిల్లలను వదలడం, ప్రత్యేక రీఫ్‌ల ఏర్పాటు వంటి వాటిని వివరించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఉప్పాడ మత్స్యకారుల సమస్యలన్నింటినీ ఇచ్చిన 100రోజుల గడువులోగా పరిష్కరించడానికి ఎడతెగని ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. సముద్రంలో చేపల లభ్యత తగ్గడానికి గల కారణాలపైనా సర్వేచేయిస్తున్నామన్నారు. చేపలు పట్టిన తర్వాత పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ద్వారా మత్స్యసంపదకు ధర పెరిగి మత్స్యకారులకు లాభాలు వచ్చేలా చేయడం వంటి పద్ధతులను నేర్పడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఉప్పాడ సముద్రపు కోత నివారణకు రక్షణ గోడకు రూ.323కోట్లు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించిందని, త్వరలో నిధులు రానున్నాయని పవన్ వివరించారు. మత్స్యకారులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కేరళ, తమిళనాడులో మత్స్యకారులు చేపలవేట నైపుణ్యం పెంచుకుని ఎలా మంచి రాబడి సాధిస్తున్నారు? సముద్ర జల క్రీడల్లో ఉప్పాడ మత్స్యకారులకు నైపుణ్యం పెంపుపై త్వరలో శిక్షణ ఇచ్చేలా వారిని పంపించడంపై సమావేశంలో చర్చ జరిగింది. కేరళ, తమిళనాడులో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ ఇవ్వనున్న శిక్షణ అంశాలపై చాలాసేపు చర్చించారు.

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

- కోనపాపపేటలో తీరం కోతకు గురై కూలిన ఇల్లు

మెయిన్‌లో..

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

8

- ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ
- జేఎన్టీయూకేలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

వెయ్యి గజాల స్థలంలో ఆక్రమణల తొలగింపు



అక్రమ కట్టడాలు కూలుస్తున్న కార్పొరేషన్ అధికారులు

- దాని విలువ రూ.5కోట్లు
- పల్లంరాజునగర్‌లో షెడ్లు కూల్చివేత
- గ్రీన్ బెల్ట్ స్థలంగా గుర్తించిన కార్పొరేషన్ అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడలో కబ్జాల పర్వానికి అడ్డూ, అదుపూ లేకుండా పోతోంది. ఒక మాజీ కార్పొరేటర్ భర్త ఏకంగా రూ.5కోట్ల విలువైన గ్రీన్ బెల్ట్‌లో వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని గుట్టు చప్పుడు కాకుండా కబ్జా చేసి సొంతం చేసుకున్నాడు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని 9వవార్డు పల్లంరాజునగర్‌లో ఎల్‌పీ నెంబర్ 134/90, టీఎస్ నెంబర్ 130/2సీపీలో రూ.5కోట్లు విలువైన వెయ్యి గజాల ప్రభుత్వ గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని కబ్జా కోరల నుంచి విడిపించి కార్పొరేషన్‌అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ డీసీపీ కృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం అక్రమ కట్టడాలను పోలీసుల సహకారంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రామ్మో మోహన్ రావు, ఇతర సిబ్బందితో కలిసి ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకున్నారు.

6 లోపు తత్కాల్‌లో ఫీజు చెల్లించవచ్చు

- డీఈవో రమేష్

కాకినాడ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ద్వారా 2025-26లో పది, ఇంటర్‌లో ప్రవేశాలకు తత్కాల్‌లో రూ.600 అదనపు ఫీజును ఈనెల 6లోపు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చని డీఈవో పి.రమేష్ తెలిపారు. గతంలో రెగ్యులర్‌గా పదో తరగతి పాత సిలబస్‌తో పరీక్ష రాసి ఫెయిలైన అభ్యాసకులకు సార్వత్రిక విద్య ద్వారా అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు 6304595699 నెంబరులో సంప్రదించాలని ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త సాయివెంకటరమణ తెలిపారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు ఇవ్వాలి

- ట్రైనీ కలెక్టర్ మనీషా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనీషా

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):సాయుధదళాల పతాక నిధికి ఉద్యోగులు, వివిధ సంస్థలు, ప్రజలు విరాళాలు ఇవ్వాలని ట్రైనీ కలెక్టర్ మనీషా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయుధ దళాల పతాక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పతాక నిధిని యుద్ధంలో గాయపడిన వారికి పునరావాసం కల్పించడానికి ఉపయోగిస్తారన్నారు. ఈనెల 7న సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తారన్నారు. ఆమె తొలి విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి నవాబ్ జాన్, ఇతర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.




వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

» ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ » కాకినాడ జేఎన్టీయూలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు

జేఎన్టీయూకే, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, వారి కోసం మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. కాకినాడ జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుక నిర్వహించారు. సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ వైడీ రామారావు, విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. 2028లో జరిగే పారా ఒలింపిక్స్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి విభిన్న ప్రతిభావంతులు ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తామన్నారు. ట్రైనీ కలెక్టర్ మనీషా మాట్లాడుతూ సామాజిక పురోగతిని పెంపొందించడం కోసం అంగవైకల్యంతో కూడిన సమాజాలను ప్రోత్సహించడం అనే ఇతివృత్తంతో 2025 ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం రెండు వసతిగృహాలు నిర్వహిస్తుండగా వాటిలో 200 మంది బాల, బాలికలు వసతి పొందుతున్నారని తెలిపారు. దృష్టి లోపం ఉన్న వారికి ఒక ఆశ్రమం నిర్వహిస్తుండగా 100 మంది మహిళలు, పురుషులు వసతి పొందుతున్నారన్నారు. ఇప్పటికే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వివిధ పరికరాలు అందించేందుకు 1,891 మందిని గుర్తించామన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అతిథులు అందజేశారు. విభిన్న ప్రతిభావంతులకు ఉత్తమ సేవలందిస్తున్న 15 సంఘాల ప్రతినిధులకు, ప్రత్యేక పాఠశాలల ఉపాధ్యాయులు 26 మందికి, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యేక పాఠశాలల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేఎన్టీయూకే రెక్టార్ సుబ్బారావు, మహర్షి సాంబమూర్తి ప్రత్యేక పాఠశాల, ఉమా మనోవికాస కేంద్రం, సిరి ప్రత్యేక పాఠశాల, శాంతివర్ధన ప్రత్యేక పాఠశాల, ప్రభుత్వ బధిర ఉన్నత పాఠశాల, కన్నా ఆశ్రయ్ మానసిక పాఠశాల, విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ప్రతినిధులు ఎం.పాపిరెడ్డి, బి.కిరణ్, జి.కొండలరావు, ఎన్.సురేష్, కేఎస్ సుబ్రహ్మణ్యం, అంధ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్, జవహర్, సిరి పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా



సినిమా పాటకు డ్యాన్స్ చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

విశాఖ-తిరుపతి మధ్య ఎనిమిది ప్రత్యేక రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ-తిరుపతి-విశాఖ మధ్య ఎనిమిది ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను జనవరి 13 వరకు నడుపుతున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సామర్లకోట మీదుగా ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు డిసెంబరు 30 వరకూ ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తాయని రైల్వే అధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారులకు అందించిన సమాచారంలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఆంధ్రజ్యోతి సేకరించిన సమాచారం ఇలా ఉంది.

● 08583 నంబరు గల విశాఖ-తిరుపతి మధ్య డిసెంబరు 29 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతికి చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు డిసెంబరు 8,15,22,29 తేదీల్లో 4 ట్రిప్‌లుగా నడువనుంది.

విశాఖ నుంచి అన్నవరానికి రాత్రి 8.40 గంటలకు చేరుకుంటుంది. సామర్లకోటకు రాత్రి 9.05 గంటలకు, రాజమహేంద్రవరం నకు రాత్రి 9.55 గంటలకు, నిడదవోలుకు రాత్రి 10.22 గంటలకు చేరుకుని తణుకు, భీమవరం.ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయ వాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుతుంది.

● 08584 నంబరు గల తిరుపతి-విశాఖ మధ్య డిసెంబరు 30 వరకూ ప్రతీ మంగళవారాల్లో బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 4 ట్రిప్‌లుగా నడువనుంది.

ఈ రైలు డిసెంబరు 9,16,23,30 తేదీల్లో 4 ట్రిప్‌లుగా నడువనుంది.

తిరుపతిలో ఈ రైలు మంగళవారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖకు చేరుతుంది.

నిడదవోలుకు ఉదయం 6.15 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరం నకు ఉదయం 6.43 గంటలకు చేరుకుని సామర్లకోటకు ఉదయం 7.28 గంటలకు, అన్నవరం నకు ఉదయం 7.53 గంటలకు చేరుకుని విశాఖకు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుతుంది.

ఈ వారానికి ఒక్కరోజు నడిచే ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కట్లు కోసం సమీప రైల్వే స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ ప్రత్యేక రైలులో 2వ తరగతి ఏసీ, మూడవతరగతి ఏసీ, ఎకానమీ మూడవ తరగతి ఏసీ, స్లీపర్, ఆరు జనరల్ బోగీలు, నాలుగు ఎస్ఎల్ఆర్‌డీ, ఒకటి ఈవోజీలతో కలిపి 21 ఎల్‌హెచ్‌బీ బోగీలతో రాకపోకలు సాగిస్తుంది.

22న నన్నయలో జాతీయ సెమినార్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

దివాన్‌చెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈనెల 22న భారతీయ జ్ఞాన వ్యవస్థలను తిరిగి పొందడం, ముందుకు సాగే మార్గం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విద్యాభారతి ఉచ్చా శిక్షా సంస్థాన్(వీబీయుఎస్ఎస్) సహకారంతో రిక్లెయిమింగ్ ఇండియన్ నాలెడ్జిసిస్టమ్స్ ఫార్వర్డ్ అనే అంశంపై జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వర్సిటీ, అనుబంధ కళాశాలలు, యుజీ, పీజీ స్థాయిలో పాఠ్యాంశాలనుఅనుసరించడం ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థల గురించి ప్రాథమిక జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం తదనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టడం ఈసెమినార్ లక్ష్యమన్నారు. సెమినార్ కన్వీనర్లుగా ఆచార్య కె.ఎస్.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.సజ్జారాజ్ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, సెమినార్ కన్వీనర్లు ఆచార్య కె.ఎస్.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.సజ్జారాజ్ పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పొల్లూరులో హీరో రవితేజ సందడి

మోతుగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధి పొల్లూరులో రవితేజ హీరోగా నటిస్తున్న నూతన సినిమా చిత్రీకరణ బుధవారం మోతుగూడెం పరిసర ప్రాంతంలో ప్రారంభమైంది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శివ దర్శకత్వం వహిస్తున్నారు. పొల్లూరు శివాలయం వీధులు ఎగువ, దిగువ జలపాతాలు, సీలేరు నది పరీవాహక ప్రాంతాలు, ఫోర్ బై పిక్నిక్, జలాశయాలు వద్ద మరికొన్ని సన్నివేశాలను చిత్రీ కరించనున్నారు. దీంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రవితేజ అభిమానులు తరలివచ్చారు.



చిన్నారులతో హీరో రవితేజ

'చేనేత'కు ఎన్నికలు నిర్వహించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని చేనేత కులాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ పంపన రామకృష్ణ కోరారు. బుధవారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత సంక్షోభం వల్ల చేతినిండా పని లేక చేనేత కార్మిక కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. చేనేత పాలక వర్గాల పదవీకాలం 13 సంవత్సరాల క్రితం ముగియగా ఇప్పటివరకు ఎన్నికలు జరపలేదన్నారు. దీంతో పర్సన్ ఇన్‌చార్జీల పాలనలో నడుస్తున్నాయన్నారు. దీనివల్ల సొసైటీల అభివృద్ధి కుంటుపడిందన్నారు. చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే సొసైటీల ద్వారా వస్త్రాల అమ్మకాలపై 30 శాతం రిబేటు అమలు చేయాలన్నారు. చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు అన్ని రకాల పథకాలు అమలు చేయాలన్నారు. కార్మికులకు ఉచిత విద్యుత్ అందించడం అభినందనీయమన్నారు. సమావేశంలో నాయకులు సూర్యచంద్రరావు, కె. రామారావు, పి. వెంకటరమణ, కె.సతీష్, పి. వెంకటేశ్వరరావు, పి. శ్రీనివాసులు, ఎస్. వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన లక్ష్మణ్‌రెడ్డి, గాయపడిన రవీంద్ర

రంపచోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బందపల్లి గ్రామానికి చెంది న సోముల లక్ష్మణరెడ్డి, వీండెల రవీంద్ర రంపచోడవరం నుంచి బందపల్లికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పీఎంఆర్‌సీ సమీపంలో పవర్ స్టేషన్ వద్ద రంపచోడవరం నుంచి గోకవరం వెళ్తున్న ఆర్టీసీ బస్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. సోముల లక్ష్మణ్‌రెడ్డి(25) అక్కడికక్కడే మృతిచెందగా రవీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. అతడికి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి కేసులో ఇద్దరి అరెస్ట్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వ్యక్తి మరణించిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులను పిఠాపురం సీఐ శ్రీనివాస్ బుధవారం అరెస్టు చేశారు. తాటిపర్తిలో తేరాటి ప్రసాద్ కూతురు పుట్టిన రోజు సందర్భంగా గత నెల 27వ తేదీ రాత్రి రోడ్డుపై వంటలు చేశారు. అదే దారిలో వచ్చిన వెంపాల సూరిబాబు పెద్ద కోడలు కృష్ణవేణికి అడ్డం పెట్టి బల్ల తగిలి పడిపోయింది. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో సూరిబాబును తోయగా పడిపోవడంతో గాయపడి మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసిన గొల్లప్రోలు పోలీసులు సూరిబాబు మృతికి కారకులైన తేరాటి ప్రసాద్, శ్రీమంతుల ఏసుదయను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్టుసీఐ,ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

శీలా వీర్రాజు పుస్తకాలు

తెలుగు యూనివర్శిటీకి అపూర్వ నిధి

పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



యార్లగడ్డ, వీసీ మునిరత్నం నాయుడికి పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శీలా వీర్రాజు సేకరించిన పుస్తకాల ద్వారా తెలుగు విశ్వవిద్యాలయానికి ఒక అపూర్వ నిధి అందిందని పద్మశ్రీ, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీపీ బ్రౌన్ మందిరం, మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శీలా వీర్రాజు సేకరించిన జాతీయ, అంతర్జాతీయ చిత్రకళా పుస్తకాలను ఆచార్య యార్లగడ్డ, తెలుగు యూనివర్శిటీ వీసీ ఆచార్య డి.మునిరత్నంలకు దామెర్ల ఆర్ట్ గ్యాలరీలలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రాణహిత కవి సన్నిధానం నరసింహశర్మ అధ్యక్షతన జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ ఎన్టీఆర్ మానసిక పుత్రిక అయిన తెలుగు విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఎన్టీఆర్ పుత్రిక అయిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, విద్యాశాఖ మంత్రి లోకేశ్ సహకరిస్తారనే విశ్వాసం తనకు ఉందన్నారు. తెలుగు యూనివర్శిటీ అభివృద్ధి రాజమహేంద్రవరం ప్రజల బాధ్యత అన్నారు. తెలంగాణ నుంచి చేరాల్సిన చర స్థిరాస్తుల విషయంలో రెండు వర్సిటీల ఉపకులపతులు ఒక నిర్ణయానికి రావాలని యార్లగడ్డ కోరారు. వీసీ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ శీలా వీర్రాజును తాను గతంలో కలిశానని, ఆయన సేకరించిన పుస్తకాలు తమకు బహూకరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు మాదేటి రవిప్రకాష్, ఆంధ్ర యూనిర్శిటీ రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ పర్వతనేని సుబ్బారావు, భగీరథి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఎన్‌వీఎస్ఎస్ లక్ష్మి, సన్నిధానం శాస్త్రి, మల్లాది శ్రీరామ్, ఇన్‌కంట్యాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమల కుమార్, విశ్రాంత మేజిస్ట్రేట్ ఎస్ఆర్ పృథ్వీ, సామాజిక వేత్త కె.సూర్యకుమారి, అమ్మభగవాన్ సేవకులు మంతెన రాధిక తదితరులు పాల్గొన్నారు.

బాలికపై మేనమామ అత్యాచారం

పోక్సో కేసు నమోదు

పిఠాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తన కళ్లెదుటే పెరిగిన బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలో ఈ సంఘటన జరిగింది. మండలంలో ఓ గ్రామానికి చెందిన పదో తరగతి చదుతున్న బాలికను ఆమె తల్లి నవంబరు 7వ తేదీ రాత్రి 7-8గంటల సమయంలో సమీపంలోనే ఉన్న మేనమామ ఇంటికి వెళ్లి పాలు తీసుకురమ్మని చెప్పింది. దీంతో బాలిక మేనమామ ఇంటికి వెళ్లింది. పాల గిన్నె కనిపించడం లేదని చెప్పి బాలికను లోపలికి రమ్మన్నాడు. తర్వాత తలుపులు వేసి బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎంతకు బాలిక రాకపోవడంతో తండ్రి అక్కడికి వచ్చి తలుపులు కొట్టాడు. తలుపులు తీసిన మేనమామ (30) అక్కడ నుంచి పరారయ్యాడు. పెద్దల్లో విషయాన్ని పెట్టినా ఫలితం లేకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసుకు ఫిర్యాదు చేయగా బుధవారం పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచారానికి పాల్పడ్డ బాలిక మేనమామకు ఇప్పటికే వివాహమై పిల్లలు ఉన్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

5,300 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

జగ్గంపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో విజిలెన్స్, సివిల్ సప్లై ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. జగ్గంపేట సివిల్ సప్లై అధికారి కృష్ణ అందించిన వివరాల ప్రకారం.. గోరింట గ్రామానికి చెందిన కోరుకొండ అచ్యుతరావు ఏపీ 39యువై 5549 వాహనంలో రేషన్ బియ్యాన్ని ఇర్రిపాక మీదుగా తరలిస్తున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. బియ్యాన్ని ఎంఎస్‌వో పాయింట్ కాటా వద్ద కాటా వేయగా 5,300 కిలోల వచ్చింది. వ్యాన్ డ్రైవర్ అచ్యుతరావు, వ్యాన్ యజమాని గనిశెట్టి రాజు, రైస్ యజమాని మన్యం తేజపై 1955 సెక్షన్‌కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రైస్ విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో విజి లెన్స్ సీఐ టి.గోపాల కృష్ణ, ఎంఎస్‌వో జీఎం కృష్ణ సిబ్బంది ఉన్నారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్.. అసభ్యకర పోస్టు

కేసు నమోదు

తాళ్లరేవు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పాతకోరింగ గ్రామానికి చెందిన ఒక మహిళ పేరిట గుర్తు తెలియని వ్యక్తి ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ క్రియేట్ చేసి అసభ్యకర ఫొటో పోస్టు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు కోరింగ ఎస్ఐ పి. సత్యనారాయణ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. గతనెల 27న బాధిత మహిళ స్నేహితుల ద్వారా విషయం తెలుసుకుంది. ఫేక్ ఐడీ క్రియేట్ చేసిన వ్యక్తిని ఎవరు నువ్వు ఎందుకిలా చేస్తున్నావని ఆమె మెసేజ్ ద్వారా అడిగింది. సదరు వ్యక్తి పాతకోరింగ గ్రామానికి చెందిన పోతుల వినోద్ అలియాస్ అర్జున్ భార్య ద్వారా మీ వివరాలు తెలుసుకున్నానని చెప్పాడు. దీంతో సదరు మహిళ తనకు అవమానము కలిగినందుకు కోరింగ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి



భారతి(ఫైల్)

ఉప్పలగుప్తం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం సెక్టార్ పరిధిలోని రాఘవులపేట అంగన్వాడీ కేంద్రం కార్యకర్త, నంగవరానికి చెందిన బొంతు భారతి(42) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందినట్టు సంఘ ప్రతినిధి కె.బేబీగంగారత్నం పేర్కొన్నారు.

8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్టు కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రధానాధికారి, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మూర్తి బుధవారం తెలిపారు. కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్మెంట్, స్టాఫ్ వచ్చి ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టిసి సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జెరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440408182లో సంప్రదించాలని కోరారు.

మురమళ్ళ వీరేశ్వరుడి ఆదాయం రూ.9.96 లక్షలు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

ఐ.పోలవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.9,96,203 ఆదాయం వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు సమక్షంలో ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో బుధవారం స్వామి హుండీలను లెక్కించారు. గత 45రోజులకు ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.9,87,354, అన్నదానం హుండీ ద్వారా రూ.8,849... 5 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్టు తెలిపారు. హుండీల ఆదాయాన్ని దేవస్థానం బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నట్టు తెలిపారు. తొలుత ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ, బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ హుండీలకు హారతి ఇచ్చి ప్రారంభించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు తదితరులున్నారు.

అంతర్వేదిలో హైకోర్టు జడ్జి పూజలు



జడ్జికి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అంతర్వేది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హైకోర్టు జస్టిస్ వి.గోపాలకృష్ణారావు బుధవారం కుటుంబసమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో దర్శనం నిర్వహింపచేసి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

గ్రామ సంఘాలు పారదర్శకంగా ఉండాలి

డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘాలు డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు, తిరిగి చెల్లింపులు, పుస్తక నిర్వహణ, సమావేశాల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రచారం చేయడంలోనూ అత్యంత పారదర్శకతతో ఉండాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట టీటీడీసీ ఆవరణలో కొత్తగా మోడల్ మండలాలుగా ఎంపికైన సామర్లకోట, జగ్గంపేట, గొల్లప్రోలు, కాజులూరు, కరప మండలాల సిబ్బందితో పేదరిక నిర్మూలనలో భాగంగా విజన్ బిల్డింగ్ మాడ్యూల్ 1,2,3లపై ఎంసీఎల్ఎఫ్ఎస్, సీఎల్ఎఫ్‌లస్థాయి అవగాహనా సమావేశం బుధవారం సామర్లకోట ఏపీఎం జగదీశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ శ్రీనివాసరావు పలు అంశాలను వివరించారు. డీపీఎం భరత్, ఐబీ ఏపీఎం ఇందిరా అన్ని క్లస్టర్ల ఎల్‌సీలు, సీసీఎస్‌లు పాల్గొన్నారు.



సామర్లకోటలో ప్రసంగిస్తున్న పీడీ శ్రీనివాసరావు

బోధనా ప్రయోగశాలల ఏర్పాటుకు పరిశీలన

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్వాంటం మిషన్ ద్వారా ఏపీలోని వివిధ విద్యా కేంద్రాల్లో 134 బోధనా ప్రయోగశాలల ఏర్పాటుకు పరిశీలన చేస్తోందని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో తాను అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారన్నారు. ప్రయోగశాలల ఏర్పాటుకు కేంద్రానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.



పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి





గొల్లప్రోలు గాంధీనగర్ అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలో పాల్గొన్న భక్తులు





సామర్లకోటలో ప్రసన్నాంజనేయస్వామికి పూజ చేస్తున్న పారిశ్రామికవేత్త శ్రీనివాస్-దంపతులు

వైభవంగా హనుమద్వ్రతం

పలు ఆలయాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కంచి మహా సంస్థానంలో హనుమద్ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. 65 అడుగుల ప్రసన్నాంజనేయస్వామి విగ్రహానికి బుధవారం రాత్రి పుష్పాభిషేకం, లక్ష తమల పాకులు, లక్ష తులసి దళాలతో అభిషేకం చేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబీకుడు చంద్రాభట్ల పతంజలి ఆధ్వర్యంలో పండితులు మహంకాళి వెంకటరామమూర్తి, చీమలకొండ గోపాలం, ఇంద్రగంటి సోమయాజులు వేదమంత్రోచ్చారణలతో ప్రసన్నాంజనేయస్వామి పాదాల చెంతన విశేష పూజలు నిర్వహించారు. మంగళ హారతులతో పలువురు భక్తులు రామభక్త హనుమాన్ నినాదాలతో 65 అడుగుల ఎత్తు నుంచి పుష్పాభిషేకం నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. విశేష పుష్పార్చన చేసి నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆలయ ఆవరణలోని సిద్ధి వినాయకుడు, శ్రీగురుదత్తాత్రేయుడు, స్వయంవర పార్వతి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, లక్ష నాగవల్లీ పత్రి పూజ, ఆంజనేయ హోమం, నీరాజన మంత్రపుష్పాలు జరిపారు. పూజల్లో పారిశ్రామికవేత్తలు మట్టే శ్రీనివాసు-విద్యుల్లత, ఆదిత్య కృష్ణ, సృష్టిక ఆశీనులయ్యారు. పండితులను వారు సత్కరించారు. పూజల్లో సుప్రీంకోర్టు న్యాయవాది రఘు దంపతులు, డాక్టర్ పార్వతి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు దంపతులు, బోళ్ల శేఖర్, పారిశ్రామికవేత్త ఈద్పుగంటి రామకృష్ణ పాల్గొన్నారు. సామూహిక హనుమద్వ్రతాల్లో సుమారు 200 మంది పాల్పంచుకున్నారు. భక్తులకు గోధుమనూక ప్రసాదం, అప్పాలు, పులిహోర, స్వామివారి ఫొటో, చేతి కంకణాలను ఆలయ నిర్వాహకుడు పతంజలి అందజేశారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంతో పాటు వాలుతిమ్మాపురంలోని ఆలయంతో స్వామివారికి తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. పలు రకాల పుష్పాలు, తులసిమాలలతో స్వామివారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. పలుచోట్ల గ్రామోత్సవాలు నిర్వహించారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలకు బుర్రా వీరబాబు-కమల దంపతులు కలశస్థాపన చేశారు. భజన గురువు కుంపట్ల భావన్నానాయుడు ఆధ్వర్యంలో ఏకాహం ప్రారంభమైంది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాపర్తిలో మాజీ ఎమ్మెల్యే దొరబాబుకు సత్కారం

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): రాపర్తిలో హనుమాన్ ఆలయ 11వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. సింధూర, తమలపాకులతో పూజలు జరిగాయి. ఆంజనేయస్వామిని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, జనసేన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు పెండెం దొరబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

11 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో వాకలపూడిలోని డీడీయుజీకేవై సెంటర్లో ఈ నెల 11 నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాలలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. టు వీలర్ టెక్నీషియన్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు మూడు నెలలు శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారం, స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. అదనంగా బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా 83284 83297, 89784 75164 నెంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

ఆకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు
దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీవైఈవో ఈరంకి ప్రభాకర శర్మ తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో 2, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3 పోస్టులు ఖాళీ వున్నాయన్నారు. తెలుగు, హిందీ, లెక్కలు, బయాలజీ బోధించాల్సి ఉంటుందన్నారు. ఐదు నెలల పాటు పని చేయాల్సి ఉంటుందని, జీతం నెలకు రూ.12,500 అని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 5వ తేదీలోగా ఎంఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.



దత్త క్షేత్రానికి పాదయాత్ర

కొత్తపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాడకు చెందిన పలువురు దత్తాత్రేయ మాల ధరించి 41 రోజులు దీక్ష చేపట్టారు. బుధవారం వారు ఇరుముడులు కట్టుకుని భక్తి గీతాలు ఆలపిస్తూ పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి కాలినడకన వెళ్లారు.

12న భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రెవెన్యూ కాలనీ రోడ్డులోని పీఆర్ భవన్‌లో భవన నిర్మాణ కార్మికులకు పథకాల అమలు, ప్రమాదాలపై ఈ నెల 12న నిర్వహించే అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్, కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన, ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ కలిసి సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నాయకులు కామిరెడ్డి బోడకొండ, టి.అన్నవరం, రామకృష్ణ, నక్క శ్రీనివాస్, అర్జున్‌రావు, భాను, శాఖ రామకృష్ణ, శ్రీనివాస్, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

'స్టాఫ్ నర్సును తిరిగి విధుల్లోకి తీసుకోవాలి'

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రి ఘటనలో సర్వీస్ నుంచి తొలగించిన స్టాఫ్ నర్సు పి.పద్మావతిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఏపీఎంఈయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బుడ్డిగ స్వామిబాబు బుధవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.మహేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావులను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన వారు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.పద్మావతి, ఎస్ఎం వల్లీ, కోశాధికారి టి.రాణి తదితరులు పాల్గొన్నారు.

మహా సంస్థానంలో గులాబి, సంపెంగ అర్చన

పిఠాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు బుధవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు సహస్ర గులాబీ, సంపెంగ పుష్ప పూజ నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించిన అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్రనామార్చన, రుత్వికులచే దత్త మూల మంత్ర అనుష్టానము, సాయంత్ర అగ్ని ప్రతిష్ఠాపన, దత్త మంత్రహోమం నిర్వహించి వివిధ హారతులు ఇచ్చారు. స్వామికి సాయంత్రం పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయ స్వామికి లక్ష తులసి అర్చన నిర్వహించారు. దత్తమాల ధరించిన భక్తులకు వేదపండితులు, దత్త గురువులు ఇరుముడి కట్టారు. సాయంత్రం దత్తస్వాముల నగరోత్సవం వైభవంగా జరిగింది. దత్తాత్రేయస్వామి ఉత్సవమూర్తిని రథంపై ఉంచి దత్తనామస్మరణతో స్వాములు ప్రదర్శనగా పురవీధుల్లో తిరిగారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు పాల్గొన్నారు. గురువారం ఇరుముడి సమర్పణ, దత్త జయంతి జరుగుతాయి.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో గులాబి, సంపెంగ అర్చన అనంతరం పుష్పాలతో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు ప్రత్యేక అలంకారం





పాదగయ వద్ద నగరోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో జగన్మోహనశ్రీనివాస్, పాల్గొన్న దత్తస్వాములు



పాదగయ క్షేత్రంలో దత్తస్వాముల ఇరుముడి ధారణ

భావనారాయణస్వామి ఈనాం భూముల సర్వే పూర్తి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో వేంచేసియున్న శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామికి చెందిన 21.23 ఎకరాల ఈనాం భూములను గుర్తించి సర్వే చేసినట్టు ఈవో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ శాఖ కమిషనరు ఆదేశాల మేరకు ఉన్నతాధికారుల ఉత్తర్వులతో దేవదాయ శాఖ డీఈవో సమక్షంలో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్, రెవెన్యూ సంయుక్తంగా ఆర్ఎస్ నెం.18/32.95 సర్వే నెంబరు 27/3లో 0.86 సెంట్లు, 33/2లో 2.29 ఎకరాలు, 40/8లో 1.59 ఎకరాలు, 44/3లో 1.47 ఎకరాలు, 44/4లో 2.63 ఎకరాలు, 45/1లో 2.58 ఎకరాలు, 45/2లో 2.81 ఎకరాలు, 45/3లో 1.90 ఎకరాలు, 45/6లో 2.15 ఎకరాలు.... మొత్తం 21.23 ఎకరాల భూమిలో సర్వే పూర్తయిందన్నారు. నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని, కమిషనరు ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సర్వే ప్రక్రియలో దేవదాయ శాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ సర్వేయరు రామకృష్ణ, వీఆర్వో మహాలక్ష్మి, ఆలయ సిబ్బంది కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

'రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం'

తాళ్లరేవు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతును రాజు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద అన్నారు. బుధవారం పాత కోరింగలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతన్నా... మీకోసం' నిర్వహించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, ఉద్యాన శాఖల ద్వారా రైతులకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను అధికారులు వివరించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, టీడీపీ నేతలు గుత్తుల శ్రీనివాససాయి, పొన్నమండ రామలక్ష్మి, వేగేశ్న భాస్కరరాజు, నడింపల్లి వినోద్, సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి బాబీ, వుంగరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): దుర్గాడలో రైతన్నా... మీ కోసం గ్రామసభ నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే రబీ, వచ్చే ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని అధికారులు వెల్లడించారు. తహసీల్దారు రామ్‌కుమార్, వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, సెక్రటరీ శ్రీనివాసరావు, సర్పంచ్ పంపన సూర్యచంద్రరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లిలో రైతన్నా... మీకోసం' నిర్వహించారు. ఆర్డీవో కె.శ్రీరమణి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి సంజయ్ కుమార్, వెటర్నరీ ఏడీ రామస్వామి, హెచ్‌వో శైలజ, తహసీల్దారు వెంకటలక్ష్మి, పశు వైద్యాధికారి డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు జడ్పీటీసీ ఆర్థిక సాయం

తాళ్లరేవు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జార్జిపేటలో లివర్ వ్యాధితో బాధపడుతున్న కుడిపూడి రాము, కేన్సర్‌తో బాధపడుతున్న వట్సూరి ఈశ్వరరావు, ఆపరేషన్ చేయించుకున్న వాసంశెట్టి అర్జునరావులను తాళ్లరేవు జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్ బుధవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నగదు అందజేశారు. నేతలు దడాల జగదీశ్వరరావు, రెడ్డి నాగేశ్వరరావు, పేర్ని ఆదినారాయణ, చిట్టూరి చలపతి పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి 'చేయూత'



స్పీచ్‌థెరపీ మిషన్, మస్క్యులర్ ఫిజియోథెరపీ మిషన్‌లను అందజేస్తున్న బాబు, కిషోర్

గొల్లప్రోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని మలిరెడ్డి వెంకట్రాజు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రానికి కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రూ.50వేలు విలువైన స్పీచ్‌థెరపీ, మస్క్యులర్ ఫిజియోథెరపీ మిషన్ సమకూర్చారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ మిషన్ యూనిట్లను కేంద్రం సిబ్బందికి డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ అందజేశారు. ఉపాధ్యాయుడు కొత్త వెంకటేశ్వరరావు దంపతులు రెండు ఫ్యాన్లు సమకూర్చారు. ఆట, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. గొల్లప్రోలు ఎంఈవోలు వెన్నా శ్రీనివాస్, శివప్రసాద్, జనసేన నాయకులు ఓదూరి నాగేశ్వరరావు, అన్నందేవర పట్టాభి, బస్సా చిట్టిబాబు, బలిరెడ్డి గంగబాబు, మామిడాల సూరిబాబు, మలిరెడ్డి నారాయణరావు, కుర్రా నారాయణరావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత కేంద్రంలో మానసిక దివ్యాంగులకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకట అపర్ణ పండ్లు, రొట్టెలు, బిస్కట్లు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, న్యాయవాదులు ఎస్ఎం ఆలీ, సత్యవాణి, బి.ఈశ్వర్ బాబు, భవిత ఉపాధ్యాయుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వలసపాకలకు చెందిన తడాల ఆదిత్య నాగమల్లిక్‌కు వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.6 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో లబ్ధిదారుడికి గొడారిగుంటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం అందజేశారు. జనసేన నాయకులు పుల్ల శ్రీరాములు, పాండ్రంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాలు పంపిణీ

కాకినాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూరంగిలో ఏర్పాటుచేసిన రైతుబజారులో 21 దుకాణాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం సాయంత్రం అందజేశారు. కూటమి నాయకులు పెంకే శ్రీనివాస్‌బాబా, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఎన్వీ రావు, ఆర్వీ రావు, రాజా, లీల, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.



డిప్యూటీ ఎంపీడీవోగా నారాయణరావు
బాధ్యతల స్వీకారం

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట డిప్యూటీ ఎంపీడీవోగా కేవీఎం నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ సచివాలయాల పర్యవేక్షణాధికారిగా విధులు నిర్వర్తించనున్న ఆయన్ను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండలంలోని పలు గ్రామ సచివాలయాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని నారాయణరావు చెప్పారు.

డిప్యూటీ ఎంపీడీవోకు సత్కారం

తాళ్లరేవు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగోన్నతిపై తాళ్లరేవు డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులైన వీజేవీ రమణను సర్పంచ్ పెయ్యల మంగేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. టీడీపీ నేతలు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, వీవోఏలు, ఆశా వర్కర్లు, కోరింగ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి'

కొత్తపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యండపల్లి రామాలయం సమీపంలో జె.వెంకట సుబ్బారావుకు చెందిన భూమిలో మూడు రోజులుగా సెల్ టవర్ నిర్మాణం పనులు మొదలెట్టారు. జనావాసాల మధ్య టవర్ నిర్మాణం ఆపాలని గ్రామస్తులు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్‌కు చెందిన గీసాల ఆనంద్-ఆస్మిక దంపతులు బుధవారం కాకినాడ మెయిన్‌రోడ్‌లోని శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌కు విచ్చేశారు. ఆస్మిక పుట్టినరోజు సందర్భంగా శ్రీయువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్‌కు రూ.లక్ష నగదు అందజేశారు. అందులోంచి సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో బి.ఫార్మసీ ఫైనలియర్ చదువుతున్న వై.గాయత్రికి రూ.25వేలు, విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ థర్డ్ ఇయర్ చదువుతున్న రాపాక హరివెంకటశివకు రూ.25వేలు అందించారు. అనంతరం ఆనంద్, ఆస్మిక పుట్టిన రోజు కేక్ కట్ చేయగా వారిని శాలువాతో సత్కరించారు. గీసాల వీరబాబు, సోము స్వాతిరాజ్‌కుమార్, సానం దీపిక హరీష్, కోన సతీష్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేసిన ఆనంద్-ఆస్మిక దంపతులు

అభివృద్ధి పనులకు శ్రీకారం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని 42, 47, 48, 49 డివిజన్లలో అభివృద్ధి పనులకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం శ్రీకారం చుట్టారు. కార్పొరేషన్ నిధులు రూ.28లక్షలతో స్వామినగర్‌లో డ్రైనేజీ, అశోక్‌నగర్‌లో సిమెంటు రోడ్డు, ద్వారకా నగర్ బొగ్గవరపు సత్రం ప్రాంతంలో కల్వర్టు, జనచైతన్య కాలనీ రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో సిమెంటు రోడ్డు, వెంకన్నబాబు కల్యాణ మండపం ప్రాంతంలో సిమెంట్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఇన్‌చార్జి కమిషనరు ఎన్వీవీ సత్యనారాయణతో కలసి శంకుస్థాపన చేశారు. ఎస్.అచ్చుతాపురం జనచైతన్య కాలనీల్లో ఇళ్ల పట్టాలిచ్చి స్థలాలు చూపించలేదని, భావనారాయణపురం వెళ్లే మార్గం చివరిలో రోడ్డు లేక వర్షాలు వచ్చినప్పుడు నీరు నిల్వ ఉండిపోవడంతో ఇబ్బందిపడుతున్నామని, రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు. లో ఓల్టేజీ సమస్య వేధిస్తోందన్నారు. స్వామినగర్‌లో అర్హత గల ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందని, గత ప్రభుత్వంలో జరిగిన ఇళ్ల పట్టాల అక్రమాలను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు శిరంగు శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, ఎం.ఆనంద్‌పాల్, వై.భాస్కర్, మహేష్‌కుమార్, కోనాల కృష్ణ, మహేష్, కవికొండల భీమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జన చైతన్య కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నానాజీ

వేట్లపాలెం పీహెచ్‌సీ నిర్వహణపై ప్రభుత్వానికి ఫిర్యాదు

సామర్లకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు సేవలు అందించడంలో వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని సామర్లకోట మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు కొండపల్లి కృష్ణమూర్తి బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. గోలి వీరభద్రరావు అనే వ్యక్తికి ఇటీవల గుండె నొప్పి రావడంతో రాత్రి సమయంలో పీహెచ్‌సీకి అత్యవసర వైద్యం కోసం తీసుకొచ్చినప్పటికీ వైద్యులు అందుబాటులో లేరన్నారు. దీంతో అతడు మృతి చెందాడన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంతో వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గిపోయిందని తెలిపారు. దీనిపై వైద్యాధికారిని ప్రశ్నించగా తీవ్ర నిర్లక్ష్య ధోరణితో సమాధానం ఇచ్చారన్నారు. ప్రభుత్వం సత్వరం స్పందించి వీరభద్రరావు మృతికి దారి తీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ చేయాలని, వైద్యాధికారి, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఫిర్యాదుదారుడైన కృష్ణమూర్తికి అమరావతి నుంచి అధికారులు ఫోన్ చేసి వాస్తవ సమాచారాన్ని నేరుగా అడిగి తెలుసుకున్నారు.

'నిబంధనల పేరుతో ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది'

పిఠాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనల పేరుతో ధాన్యం కొనుగోళ్లకు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. మొంథా, దిత్వా తుఫాన్ల ప్రభావంతో పిఠాపురం పట్టణం, మండలంలోని గ్రామాల్లో వరి తదితర పంటలకు జరిగిన నష్టాన్ని, ధాన్యం కొనుగోళ్ల విషయంపై రైతుల ఇక్కట్లను తెలుసుకునేందుకు ఏపీ రైతు సంఘం ప్రతినిధులు, సీపీఐ నాయకులతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. రైతులకు అవసరమైన గోనె సంచులను అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

తేమ శాతం అధికంగా ఉందని, ధాన్యం రంగు మారిందని, కేళీ ఉందంటూ కొనుగోళ్లకు రకరకాల కొర్రీలు పెడుతుండటంతో రైతులు దళారులకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందిపడుతుంటే మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటనలకే పరిమితమయ్యారని విమర్శించారు. మొంథా తుఫాను పంట నష్టాన్ని అంచనా వేసి నెల దాటినా ఇంతవరకూ పరిహారం అందలేదన్నారు. ఉచిత బీమా పథకాన్ని ఎత్తివేయడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు.

ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని, ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురంలో ఈ నెల పదో తేదీన ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, పిఠాపురం కార్యదర్శి సాకా రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

తుని రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని తుని భవిత సెంటర్‌లో నిర్వహించారు. చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే యనమల దివ్య 60 మంది విద్యార్థులకు భోజనాన్ని సమకూర్చగా ఆ వంటకాలను ఎంఈవో గీతాదేవి విద్యార్థులకు అందజేశారు. ఈవోపీఆర్డీ మరిడయ్య, మండల పరిషత్ ఏవో ప్రసాద్, భవిత సిబ్బంది ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'కలెక్టర్ కార్యాలయ ముట్టడికి తరలిరావాలి'

రంపచోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ మైనింగ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 8న పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే నిరసన కార్యక్రమానికి ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనింగ్ వలన నష్టపోతున్న ఆదివాసీ రైతులు, బాధితులకు న్యాయం చేయాలని, మైనింగ్ మాఫియాతో కొమ్ముకాస్తూ ఆదివాసీ నాయకులపై దాడులు చేయిస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసునమోదు చేయాలని డిమాండ్ చేశా రు. నరసాపురం క్వారీ వలన నష్టపోతున్న బాధితులు గత ఎనిమిది నెలలుగా పోరాటం చేస్తున్న అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, అక్రమ కేసులు ఎత్తివేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పొడియం అరుణకుమారి, బల్లెం గంగాభవాని, చిలకమ్మ, కారు అరుణకుమారి, దేవి శ్రీదేవి, నాగలక్ష్మి, కూర చిట్టిబాబు పాల్గొన్నారు.

మన్యంలో టెన్షన్

● పోలీసుల అప్రమత్తం, భద్రత కట్టుదిట్టం

మోతుగూడెం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో బుధవారం పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. మావోయిస్టులు పీఎల్‌జీఏ వారోత్సవాలు నేపథ్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మావోయిస్టులు ప్రతీకారం దాడుల కు పాల్పు పడవచ్చని మెగా వర్గాలు హెచ్చరి ంచడంతో ఏవోబీ భద్రత కట్టుదిట్టం చేశారు. మోతుగూడెం ఎస్సై ఎస్ కే సాదిక్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్‌ఏ/42 బలగాలతో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్ట్‌వద్ద ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దులో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మోతుగూడెం సివిల్ పోలీసులు శ్రీను, మురళి, నిబంధన, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు

వాహనాల తనిఖీ

దేవీపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇందుకూరుపేట గ్రామ శివారున బుధవారం రాత్రి దేవీపట్నం ఎస్‌ఐ షరీఫ్ తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. వాహన రికార్డులు పరిశీలించి చలాన్లు విధించారు. వాహనాదారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

రంపచోడవరం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జ్యుడిషియల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.మురళి గంగాధరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రంలో విద్యను అందించ డం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వొకేట్లు సీహెచ్ సంతోష్‌కుమార్, టి.వీరబాబు, కోర్టు సూపరింటెండెంట్ నాగ భూషణం, ఎంఎల్ఎస్సీ ప్రతినిధి గౌతమి, పోలీసు కోర్టు ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే నిర్వహించి మా గ్రామాన్ని వదిలేశారు..



చింతూరు ఐటీడీఏ పీవోను కలిసిన మర్రిగూడెం నిర్వాసితులు

కూనవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మా గ్రామాన్ని పోలవరం ముంపు గ్రామంగా గుర్తించి సర్వే నిర్వహించి చివరకు మా గ్రామానికి పరిహారం ఇవ్వకుండా మానేశారని మర్రిగూడెం పోలవరం నిర్వాసితులు చింతూరు ఐటీడీఏ పీవో శుభం నోక్వాల్ కలిసి వినతి పత్రం అందజేశారు. మా గ్రామం లో 2022 లో నోటిఫికేషన్ విడుదల చేశారని ఇంటింటికీ సర్వే నిర్వహించి ఇంటి కొలతలు తీసుకున్నారన్నారు. అయితే ఇంతవరకు మాగ్రామాన్ని పట్టించుకోవడంలేదని నిర్వాహితులు పీవోకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిటాల వెంకట్ చిలకం లక్ష్మణరావు, కట్టిబోయిన వెంకటేశ్వరరావు, దారా సుజా త, పడాల పుణ్యవతి, చిచ్చడి మంజుల, ఆవుల సుగుణ, కోరుకొండ లక్ష్మినిర్మల, సుశీల, నిర్మల, సుశీల, బీరం కామేశ్వరి పాల్గొన్నారు.

20న చారుమజుందార్, భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ

అడ్డతీగల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న ఏలేశ్వరం వినోద్ మిశ్రానగర్‌లో కామ్రేడ్ చారుమజుందార్, షహీద్ భగత్ సింగ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామని సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు తెలిపారు. బుధవారం అడ్డతీగలలో దీనికి సంబంధించి పత్రికా ఆవిష్కరణ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు నాగులపల్లి అర్జునుడు, సోమల కుశల, తీగల రాజారావు, నాగులపల్లి శంకరు, బలువు రమణ తదితరులు పాల్గొన్నారు.

'రైతులు లాభదాయక పంటలు సాగు చేయాలి'

ఎటపాక,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు లాభదా యక పంటలసాగు వైపు దృష్టిసారించాలని రంపచోడవరం ఏడీఏ రామ్మోహన్‌రావు చెప్పారు. బుధవారం గన్నవరం గ్రామంలో రైతన్న-మీ కోసం వర్క్‌షాపు కార్యక్రమంను ఎంపీటీసీ కంటే రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈసంద ర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడారు. రైతన్న- మీకోసం కార్యక్రమంలో ఇటీవల రైతుల వద్దకు వెళ్లి వారి సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు బొల్లా పుల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో దుర్గారమేష్, గ్రామ సెక్రటరీ సింగవరపు సురేష్, శివాజీ, జయమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన

వీఆర్‌పురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామ సచి వాలయం కార్యాలయం ఆవరణలో బుధవారం రైతన్న మీకోసం గ్రామసభ వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈక్రమంలో వ్యవ సాయశాఖ అధికారి కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు సోడె జోగారావు, పండా రత్తయ్య దేవయ్య, పూసం ముత్తయ్య, ఎస్.మోహన్, కిరణ్ పాల్గొన్నారు.

కానివాడ సందర్శించిన అధికారులు

వై.రామవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మండల ఎగువ ప్రాంతమైన కానివాడ పంచాయతీని బుధవారం పీహెచ్‌వో దయానంద, ఎంపీడీవో బాపన్నదొరలు సందర్శించి హౌసిం గ్, ఐహెచ్‌హెచ్‌ఎల్, పి4అంశాలపై రివ్యూ చేశారు. రబ్బరు, జాఫ్రా రైతులకు అవసరమైన పరికరాల కల్పనకు ఐటీడీఏ పీవో దృష్టికి తెలిపుతామన్నారు. అనంతరం పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ ఏబీఎఫ్ లవన్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్న మీకోసం వర్క్‌షాప్

దేవీపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):దేవీపట్నం మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో బుధవారం రైతన్న మీకోసం వర్క్‌షాప్ నిర్వహించామని ఏవో వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఐదు పంచసూత్రాలు నీటి భద్రత, డిమాండ్ ఉన్న పంటలు పండించడం, అగ్రికల్చరల్ టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్, రైతులకు ప్రభుత్వం మద్దతు, పాడి పశువులు, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించటం, రుణ సదుపాయం అంశాలపై రైతులతో చర్చిం చి ప్రణాళిక తయారు చేశారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై వినతి

దేవీపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ 44 గ్రామాల ముంపు సమస్యలను విజయవాడలో ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆఫీసులో బుధవారం దేవీపట్నం బీజేపీ మండల అధ్యక్షుడు కారం రామన్నదొర వినతి పత్రం అందించారు. ఆయన వెంట సోడే మురళి, యలగాడ నాగేశ్వరరావు, మూలేం అబ్బులు, కుంజం వెంకన్న దొర ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం



నవధాన్యాలతో వేసిన చిత్రాన్ని పరిశీలించి, మహిళా రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

సీతానగరం గ్రామంలో 'రైతన్నా మీకోసం'

జగ్గంపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల బాగుకోరే ప్రభుత్వం తమదని, లాభసాటి వ్యవసాయం ద్వారా రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని సీతానగరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడారు. రైతన్నా మీకోసం వారోత్సవాల కార్యక్రమం విజయవంతమైందన్నారు. అన్నదాత మేలు కోరే వ్యక్తి సీఎం చంద్రబాబు అన్నారు. రైతుల పేరుతో పార్టీ పెట్టి వారిని అన్నివిధాలా వేధించిన ఘనుడు జగన్ మాత్రమే అని ఎమ్మెల్యే మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తుందన్నారు. రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు అందించడం జరుగుతుందని ఇది ఒక కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఏ పంటకు ఏ సమమయంలో ఎరువులను అందించాలో వ్యవసాయ శాఖ పర్యవేక్షిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రోత్సాహకాలతో రైతులను ఆదు కునేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాలా సూరిబాబు, కొత్త కొండబాబు, అడపా తాతాజీ, వ్యవసాయ శాఖ ఏడీ జి.శ్రీనివాస్, మండల ఏవో ఎస్. నరసింహ, అర్టికల్చర్ అధికారిని శ్రీవల్లి పాల్గొన్నారు.

దత్తజయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో గురుదత్తాత్రేయుడు

అన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో గోడేవారితోటలో దత్తాత్రేయ ఆలయంలో శ్రీసత్యదత్త వైదికధార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో దత్తజయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గురుదత్తాత్రేయుడికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పురుషసూక్త విధానంలో బిల్వతులసి పత్రి, సుగంధభరితపుష్పాలతో సహస్ర నామపూజలు, నీరాజనమంత్రపుష్పములు, సిద్ధమంగళసూత్ర పారాయణలు నిర్వహించి ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమాలను మహేంద్రవాడ సత్యసాయి జగదీష్‌శర్మ, వారణాసి సుబ్రహ్మణ్యం, భమిడపాటి రామకృష్ణ నిర్వహించారు.

దివ్యాంగులకు అనేక పథకాలు

తొండంగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కులు వారికి తెలిసే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఈవోలు షేక్ బాబ్జి, సుబ్బిరెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తొండంగి భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్స్ ఇస్తున్నదన్నారు. ఫిజియో థెరపిస్ట్ సందీప్, భవిత ఉపాధ్యాయులు నాగేశ్వరావు, జగన్నాధం, స్థానిక నేతలు పరమేశ్వరావు, వంశీ ఉన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు

రహదారిని పట్టించుకోండి..!



మురారి ఆలయానికి వెళ్లే మట్టి రోడ్డు

గండేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో మురారి గ్రామ శివారులో మామిడి తోటలో కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరు గాంచిన కనకదుర్గమ్మ తిరునాళ్ల ఈనెల 7 ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ తిరున్నాళ్లకు చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీ వాహనాల్లో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించి కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేసి సాయ ంత్రం వరకు ఆనందంగా గడుపుతారు. అయితే ఆలయానికి వెళ్లే రహదారి మట్టి రోడ్డు కావడంతో భక్తులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము ధూళిపైకి లేచి ద్విచక్ర వాహనదారులు, ఆలయానికి నడిచి వెళ్లే భక్తులకు కళ్లల్లోకి పడుతోంది. మురారి గ్రామం నుంచి అమ్మవారి గుడి వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉంది. ఇప్పటికైనా ఈ రోడ్డును మెరుగుపరిచి భక్తులకు ఇబ్బందులు లేకుండాచేయాలని పలువురు కోరుతున్నారు.

యూనిఫాం వితరణ

తొండంగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు బుధవారం యూనిఫాం అందించారు. పాఠశాల ఉపాధ్యాయుల ఆర్థిక సహాయంతో 35 మంది విద్యార్థులకు రూ.45 వేలు విలువైన దుస్తులు అందించారు. విద్యార్థులకు అవసరమైన మాస్ డ్రిల్ బేస్ డ్రమ్, క్యారమ్ బోర్డులను గైడ్ టీచర్ ఎం.శ్రీదేవి అందించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు టి. శ్రీదేవి విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నప్పుడు అందించే మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లను రూ.5 వేలతో అందించారు. ప్రధానోపాధ్యాయులు చాట్రాతి సత్యన్నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ బద్దిలోవరాజు, కాలిబోయిన చంద్రరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు



కోటనందూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం

కోటనందూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలుకు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. గత ఏడాది పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. అలాంటి సమస్య లేకుండా చూడాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. దీనిపై తుని వ్యవసాయశాఖ ఏడీ కేజీ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. బుధవారం కోటనందూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. మండల సమావేశం మొక్కుబడిగా సాగుతుందని, అధికారులు సమావేశానికి రాకపోతే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో వెంకటనారాయణ మాట్లాడుతూ ఈసమస్య పునరావృతం కాకుండా చూస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ...

గ్రామస్థుల ఆందోళన

శంఖవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంఖవరంలో ఆటోను టిప్పర్ లారీ ఢీకొట్టడంతో వివాదం తలెత్తింది. శంఖవరం వైపు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. లారీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తించడంతో వివాదం తలెత్తింది. వేగంగా వెళుతున్న లారీల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి లారీలను గ్రామస్తులు నిలిపివేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. లారీ యజమానులు, గ్రామపెద్దల మధ్య చర్చలు సఫలం కావడంతో ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వేగంగా వెళుతున్న లారీలతో దుమ్ము, ధూళి లేచిపోతుండటంతో తరచూ రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని త్వరలో ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ తెలిపారు.

ఘనంగా హనుమత్ వ్రతం

ప్రత్తిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం హనుమత్ వ్రతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధర్మవరం జువ్వల రామాలయం వద్ద హనుమాన్ విగ్రహాన్ని ప్రత్యేక పూల అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ ఆలయం వద్ద అన్నదానానికి ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.15వేలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో 5వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు జువ్వల చినబాబు, సానా సూకరాజు, జువ్వల బాబులు, జువ్వల దొరబాబు, స్థానిక పెద్దలు దొడ్డిపట్ల సోమన్నదొర, అడ్డిపల్లి రాజా, కుప్పిన శ్రీను, పెదిరెడ్డికాసులు, జువ్వల సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రత్తిపాడులో ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద పంచముఖ అంజనేయస్వామికి పత్రి రమణ ఆధ్వర్యంలో హనుమద్ పూజలు నిర్వహించారు.



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలి

రౌతులపూడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. రౌతులపూడి భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కర రావు, ఎంఈవో గాడి కొండబాబు, ఉపాధ్యాయులు ఎం.అప్పారావు, శ్రీను, సీజీవి మువ్వల కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ నేతృత్వంలో స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం (భవిత)లో దివ్యాంగ విద్యార్థులకు ప్యానల్ న్యాయవాదులు బుగతా శివ, అవసరాల దేవి, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. పిల్లలు చేసిన బొమ్మలు, ఆట వస్తువులను వారు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 30 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కౌన్సిలర్ మూది నారాయణస్వామి దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు. మెప్మా ప్రసాద్, శ్రీలక్ష్మి, వాణి పద్మజ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం

కోటనందూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యాసన స్థాయిలను మదింపు చేస్తూ రాజమండ్రికి చెందిన డైట్ విద్యార్థులు, సీఆర్పీల అధ్వర్యంలో జీఎఫ్ఎల్ఎన్ అసెస్మెంట్ సర్వే చేపడుతున్నామని రాజమండ్రి డైట్ అధ్యాపకుడు ఎస్.రవికుమార్ తెలిపారు. బుధవారం కోటనందూరు, జగన్నాధపురం, అల్లిపూడి, ఉప్పరగూడెం, పి.కొట్టాం పాఠశాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులను అన్ని తరగతుల్లో ఉన్నతంగా తీర్చిదిద్దడమే సర్వే లక్ష్యమన్నారు. గణితం, ఇంగ్లీషు, తెలుగు బోధన ఏవిధంగా ఉందో తెలుసుకుంటున్నామన్నారు. ఎంఈవో శ్రీనివాస్ సీఆర్పీ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాచపల్లిలో దీపోత్సవం

ప్రత్తిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాచపల్లిలోని అరుణాచల క్షేత్రంలో కృతికా దీపోత్సవం నిర్వహించారు. రాచపల్లి దేవస్థానంలో సాయంత్రం 6నుంచి గురువారం ఉదయం 6గంటల వరకు కృతికా దీపం కొనసాగేలా చర్యలు చేపట్టారు. అరుణాచల క్షేత్ర వ్యవస్థాపకుడు స్వామి రమానంద ఆధ్వర్యంలో నిర్వహించిన కృతికా దీపోత్సవానికి కాకినాడ ఆదిగురు యోగా పీఠం సద్గురు సచ్చిదానంద యోగి విచ్చేసి దక్షిణామూర్తి స్తోత్రంపై ప్రసంగం చేశారు.

తుఫానుకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రత్తిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీను కోరారు. మండలంలోని ప్రత్తిపాడు, రాయవరం, లంపక లోవ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి తడిసిన ధాన్యం రాశులను పరిశీలించారు. రైతు భరోసా కేం ద్రాల వద్ద నమోదు కాని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

అగ్రిటెక్‌కు ప్రభుత్వం ప్రోత్సాహం

ప్రత్తిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాగుకు టెక్నాలజీ తోడైతే రైతాంగానికి అధిక ఆదాయం వస్తుందని, దీని కోసమే ప్రభుత్వం అగ్రిటెక్‌ను ప్రోత్సహిస్తుందని ఆత్మపీడీ పాల్, మండల వ్యవసాయాధికారిణి జోకా అమృత తెలిపారు. రాచపల్లిలో బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీ కోసం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసంద ర్భంగా పాల్, అమృత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యంపై గత ప్రభుత్వం రద్దు చేసిన 100శాతం సబ్సిడీని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. అలాగే ప్రత్తిపాడు, పెద్దిపాలెంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

హిందీ అకడమిక్ ఇనస్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు

తొండంగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాల్గు హిందీ ఇనస్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తొండంగి ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి తెలిపారు. దానవాయిపేట, పెరుమాళ్ళపురం, ఏవీనగరం, బెండపూడి ఉన్నత పాఠశాలల్లో ఉన్న హిందీ పోస్టులు భర్తీ చేసేందుకు ఈ నెల 5లోపు అభ్యర్థులు అర్హత పత్రాలతో కూడిన దరఖాస్తులు మండల విద్యాశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. డిసెంబరు 8 నుంచి 7 మే 2026 వరకూ 5నెలల పాటు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయాలని, రూ.12500 వేతనం ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



నూకాపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం మర్రిపాకకి చెందిన టీడీపీ నాయకుడు కాపువరపు నూకాపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నూకాపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుమారులు కాపవరపు మురళీకృష్ణ, సురేష్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాపువరపు ప్రకాష్‌రావు, గద్దె మారుతి, కాపవరపు శివ, ఎంపీటీసీ పైలా శివరామకృష్ణ, దుల్ల అనిల్, కాపవరపు నాగు, కాపువరపు రామాంజనేయులు, కాపవరపు రమణ, కాపవరపు చిన రాముడు, కాపువరపు శ్రీను పాల్గొన్నారు.

పెన్షన్‌లో కోతపై నిలదీత


తుని రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో లోవ కొత్తూరులో గ్రామంలో ఎస్సీ కాలనీలో 21 మంది వృద్ధుల పెన్షన్ సొమ్ము నుంచి బలవంతంగా ఇంటి పన్నులు వసూలు చేయడంపై అదే ప్రాంతానికి ఒక మహిళ నిలదీసింది. విషయంపై పంచాయతీ కార్యదర్శి స్వామిని వివరణ కోరగా పెన్షన్‌లో ఎటువంటి తగ్గింపులేదని వివరణ ఇచ్చారు.



ఏలేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామివారు

వైభవంగా హనుమత్ వ్రతాలు

ఏలేశ్వరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమత్ వ్రతంను పురస్కరించుకుని బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే బాలాజీచౌక్ సెంటర్, మార్కెట్ వీధిలో ఉన్న ఆంజనేయస్వామి, శ్రీసంజీవని ఆంజనేయస్వామి ఆలయాల్లో పురోహితులు పి.రమణ, పెద్దింటి గోపి నేతృత్వంలో గుర్రం లోవరాజు, మహాగంగ, అలమండ హర్ష, మండ వీరేష్, జ్యోతి దంపతులతో గణపతి పూజ, సహస్ర నాగవల్లి, సహస్ర సింధూరం, సహస్ర కదలీఫలాలతో అర్చన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పి.కామేష్, కంచర్ల సత్యనారాయణ, రమేష్, రాజా, రామకృష్ణ, పసుపులేటి శ్రీను, జగన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

పంచసూత్రాలను అనుసరించాలి

శంఖవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నీటి భద్రత, డిమాండ్ ఆధారిత సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ ఆధారంగా రైతులు పంటల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పశువైద్య సహాయ సంచాలకులు మనోజ్‌కుమార్ సూచించారు. బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా కొంతంగి రైతుసేవా కేంద్రంలో వర్క్‌షాపు నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.గాంధీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పశువైద్యులు మాట్లాడారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తామని వ్యవసాయ అధికారి పి.గాంధీ తెలిపారు.

ప్రజలకు గిరిబాబు లేఖ

ప్రత్తిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు బుధవారం నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బహిరంగ లేఖ రాశారు. కోఆర్డినేటర్‌గా ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన లేఖ విడుదల చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.